

స్థానికులను అడిగి నీటి సమస్య గురించి తెలుసుకుంటున్న కార్పొరేటర్ పావని

వీవీ గిరినగర్‌లో లోప్రెషర్ సమస్య పరిష్కారానికి చర్యలు

చిక్కడపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వీవీ గిరినగర్‌లో లోప్రెషర్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ పావని అన్నారు. బస్తీలో తాగునీరు లోప్రెషర్‌తో సరఫరా అవుతోందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో మంగళవారం జలమండలి మేనేజర్ కృష్ణమోహన్‌తో కలిసి బస్తీలో పర్యటించి సమస్యను పరిశీలించారు. కొత్త పైపులైన్ ఏర్పాటు చేయాలని స్థానికులు కార్పొరేటర్‌ను కోరారు. సమస్య పరిష్కరించాలని జలమండలి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శంకర్, బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్ పాల్గొన్నారు.



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవిచారి

హరినగర్‌లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

రాంనగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): హరినగర్ వాసులకు తాగునీటి ఎద్దటి లేకుండా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ రవిచారి జలమండలి అధికారులకు సూచించారు. హరినగర్‌లో పైపులైన్ పగిలిపోవడంతో ఆరు రోజుల నుంచి నల్లాల ద్వారా తాగునీరు సరఫరా కాకపోవడంతో స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన సమస్యను జలమండలి చిలకలగూడ డీజీఎం మోహన్ రావు, మేనేజర్ శివసాయి దృష్టికి తీసుకెళ్లగా మంగళవారం పైపులైన్ నిర్మాణ పనులను చేపట్టారు. పనులను పరిశీలించిన కార్పొరేటర్ మాట్లాడుతూ.. మొహర్రం, బోనాలు, ఏకాదశి పండగల సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎంపీ ఆర్. కృష్ణయ్య

డీఎస్సీని రెండు నెలలు వాయిదా వేయాలి

రాంనగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీని రెండు నెలల పాటు వాయిదా వేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బీసీ భవన్‌లో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ ఆధ్వర్యంలో డీఎస్సీ, గ్రూప్-1 అభ్యర్థుల డిమాండ్ల సాధన సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. డీఎస్సీ, గ్రూప్ 1, 2, 3 అభ్యర్థుల డిమాండ్లపై సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థి, నిరుద్యోగ సంఘాల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలను తీసుకుని ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలన్నారు. గ్రూప్-1లో పోస్టులు 1600కు పెంచాలని, గ్రూప్‌లో 2 వేలు, గ్రూప్ 3లో మూడు వేల పోస్టులు పెంచి పరీక్షలు నిర్వహించాలన్నారు. టీచర్ పోస్టులను 25వేలకు పెంచి డీఎస్సీ నిర్వహించాలని కోరారు. సమావేశంలో బీసీ సంఘం నేతలు వేముల రామకృష్ణ, రాందేవ్‌మోదీ, విద్యార్థి సంఘం నేతలు పాల్గొన్నారు.

అశోక్‌నగర్‌లో కొనసాగుతున్న బందోబస్తు

హైదరాబాద్ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల ఆందోళనల నేపథ్యంలో అశోక్‌నగర్‌లో పోలీసు బందోబస్తు కొనసాగుతోంది. డీఎస్సీ పరీక్ష వాయిదా వేయాలంటూ, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలను వాయిదా వేసి పోస్టులు పెంచాలంటూ కొన్ని రోజులుగా నిరుద్యోగులు మెరుపు ఆందోళనకు దిగుతున్నారు. అశోక్‌నగర్, చిక్కడపల్లి, ఆర్టీసీక్రాస్ రోడ్డు, జవహర్‌నగర్‌లో హాస్టల్స్‌కు, కోచింగ్ సెంటర్లు, స్టడీ హాల్స్‌కు అడ్డాలుగా మారాయి. దీంతో పది మంది కలిసి ప్లకార్డులతో ఆందోళన చేస్తుండడంతో ఉద్రిక్తంగా మారుతోంది. ఇటీవల వరుసగా జరిగిన నిరుద్యోగుల ఆందోళన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. సిటీ సెంట్రల్ లైబ్రరీ వద్ద మధ్యాహ్నం, సాయంత్రం సమయంలో నిరుద్యోగులు ఆందోళన చేస్తారంటూ సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో భారీగా పోలీసులు మోహరించారు.

'గౌడ సొసైటీలకు ప్రభుత్వం భూమి కేటాయించాలి'

కవాడిగూడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం పేరుతో కిట్లను పంపిణీ చేయడం కాదని, గీత కార్మికుల సంక్షేమం కోసం సొసైటీలకు ప్రభుత్వం భూమి కేటాయించి తాటి, ఈత వనాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రంగరాజ్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం కవాడిగూడలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో గౌడ కులస్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు. తాటి, ఈత వనాలను పెంచడానికి ప్రాధాన్యం ఇవ్వాలని, గీత కార్పొరేషన్‌కు ప్రత్యేక నిధులు కేటాయించి గౌడ కులస్థులకు ఉపాధి అవకాశాలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు.

వీఆర్వోలను రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలి

రాంనగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జీవో నంబర్ 121 రద్దు చేసి, ఇతర శాఖల్లో పనిచేస్తున్న వీఆర్వోలను రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. ఉపేందర్‌రావు కోరారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన సంఘం సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్వోల వ్యవస్థను రద్దు చేసి, వారిని ఇతర శాఖలకు బదిలీ చేశారని అన్నారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం నగర అధ్యక్షుడు కొంపల్లి విజయరావు, ప్రతినిధులు టి.విజయకుమార్, సుదర్శన్, పాక రాజు, ఎం.రాజు, శ్రీరాములు, వెంకటేష్, కృష్ణంరాజు, మహేందర్ పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న గంజి రాజమౌళిగుప్తా తదితరులు

ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

విద్యార్థినులకు వసతిగృహం

ముషీరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వాసవీ ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముషీరాబాద్‌లో విద్యార్థినుల కోసం నిర్మించిన వసతి గృహాన్ని ఈనెల 28వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభిస్తున్నామని హాస్టల్ ట్రస్ట్ చైర్మన్ గంజి రాజమౌళిగుప్తా తెలిపారు. మంగళవారం ముషీరాబాద్‌లోని హాస్టల్ ట్రస్ట్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హాస్టల్ ప్రారంభోత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి టీజీ వెంకటేష్ భవన నిర్మాణానికి కోటి రూపాయలు విరాళం అందజేశారన్నారు. వసతి గృహంలో 60 మంది విద్యార్థినులకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో వాసవీ ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ సభ్యులు సుధాకర్ గుప్తా, సత్తయ్య, రాజశేఖర్ గుప్తా, శ్రీనివాస్, వీరేందర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో

సౌకర్యాలు అంతంత మాత్రమే

● వైరింగ్ వ్యవస్థ అస్తవ్యస్తం ● ఒక్కలైటూ వెలగని వైనం ● పనిచేయని పవర్ బోర్లు

చిక్కడపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో సౌకర్యాలు కల్పించి శుభకార్యాలు నిర్వహించుకోవడానికి వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను మునిసిపల్ కార్యాలయంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నించగా.. స్థానికులతోపాటు రాజకీయ నాయకులు ఉద్యమించారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణం అయినప్పటి నుంచి ఏదో ఒక అసౌకర్యం వల్ల కార్యక్రమాలు నిర్వహించుకునేవారు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు నిర్మించారు. సౌకర్యాల మాట మాత్రం మరిచిపోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మొదటి అంతస్తులో కరెంట్ లేదు. వైరింగ్ వ్యవస్థ పూర్తిగా పాడవడంతో ఒక్క లైటు కూడా వెలగడంలేదు. కమ్యూనిటీహాల్‌కు రెండు పవర్ బోర్లు ఉన్నాయి. అవి పాడైపోయి చాలా రోజులైంది. వాటికి మరమ్మతులు చేయించే నాథుడే కరువయ్యారు.



జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్

సమావేశాలు నిర్వహించుకునేందుకు కమ్యూనిటీహాల్ కిరాయి రూ. 10 వేలు వసూలు చేస్తున్నా మెయింటెనెన్స్ చేయడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. వివాహాల సందర్భంలో వధూవరులు దుస్తులు మార్చుకోవడానికి కూడా సౌకర్యాలు లేని పరిస్థితి ఉంది. బాత్‌రూమ్‌లు పాడైపోయాయి. మెయిన్‌గేట్‌కు తాళం లేదు. కార్యక్రమాల కోసం బుక్ చేసుకుందామని ఎవరైనా మునిసిపల్ కార్యాలయానికి వెళ్తే ఏదో ఒక కారణం చెప్పి హాల్‌ను బుకింగ్ చేయరనే ఆరోపణలున్నాయి. కమ్యూనిటీహాల్ నిర్వహణను తమకు అప్పగిస్తే మరమ్మతులు చేసి, శుభకార్యాలకు అద్దెకు ఇస్తూ మునిసిపల్ శాఖకు ఆదాయం సమకూరుస్తామని ఎస్ఆర్‌టీ జవహర్‌నగర్ పరిరక్షణ కమిటీ సభ్యులు అంటున్నారు.

అభివృద్ధి చేయాలి



జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌ను అభివృద్ధి చేయాలి. పేదలు శుభకార్యాలు చేసుకోవడానికి అందుబాటులోకి తీసుకురావాలి. సౌకర్యాలు కల్పించి అద్దెకు ఇస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది.

\- గుండు జగదీశ్‌బాబు, స్థానికుడు

బోర్లు పనిచేయని విషయం మా దృష్టికి రాలేదు

కమ్యూనిటీ హాల్‌లో బోర్లు పనిచేయని విషయం మా దృష్టికి రాలేదు. బోర్లు, కరెంట్ సమస్యలు ఎలక్ట్రిసిటీ విభాగం దృష్టికి తీసుకెళ్తా.

\- అబ్దుల్ సలాం, ఏఈ, జీహెచ్ఎంసీ

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం

కవాడిగూడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): లోయర్‌ట్యాంక్‌బండ్ డీబీఆర్ మిల్ హెల్త్ సెంటర్ వద్దగల రేణుకా ఎల్లమ్మ, పోచమ్మ దేవాలయంలో మంగళవారం ఎల్లమ్మ కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ, ఆలయ కమిటీ అధ్యక్షుడు బండెల ముఖేష్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ, బీజేపీ రాష్ట్ర నాయకుడు జి. వెంకటేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒగ్గు పూజారి సిందం నాగేష్ ఆధ్వర్యంలో కల్యాణం జరిగింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ కవాడిగూడ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, బీజేపీ డివిజన్ ప్రధానకార్యదర్శులు ఎ. ప్రభాకర్ గంగపుత్ర, కేశవరాజు తదితరులు పాల్గొన్నారు.



లోయర్‌ట్యాంక్‌బండ్‌లో రేణుకా ఎల్లమ్మ కల్యాణంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

చాదర్‌ఘాట్‌లో..

బర్కత్‌పుర/గోల్నాక, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చాదర్‌ఘాట్ చౌరస్తా వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయంలో బోనాల వేడుకల సందర్భంగా అమ్మవారి కళ్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న కార్పొరేటర్‌ను ఆలయ నిర్వాహకులు, ఎ. అంజయ్య శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, నాయకులు సురేందర్, నరేందర్, నర్సింగ్, వాసు తదితరులు పాల్గొన్నారు. గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ కల్యాణంలో పాల్గొని అమ్మరికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



చాదర్‌ఘాట్ ఆలయంలో కల్యాణంలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి



అమ్మవారికి పూజలు నిర్వహించిన కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు కృషిచేయాలి

ముషీరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్ అన్నారు. మంగళవారం రాంనగర్‌లోని సెయింట్ పాయిస్ హైస్కూల్‌లో ప్రజా నాట్య మండలి ప్రధాన కార్యదర్శి ఎస్. మారన్న అధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలిద్దాం - సమాజాన్ని మేలుకొల్పుదాం పేరుతో ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏసీపీ మాట్లాడుతూ.. యువత డ్రగ్స్ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గాంధీ ఆస్పత్రి సూపరిండింటెండ్ ఎం. రాజారావు మాట్లాడుతూ.. డ్రగ్స్ వల్ల ఏర్పడే అనర్థాలు, కుటుంబం విచ్ఛిన్నం తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని కోరారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండేలా తల్లిదండ్రులు ప్రత్యేక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో సెయింట్‌పాయిస్ స్కూల్ హెచ్ఎం లిండా, పట్నం సంస్థ రాష్ట్ర కార్యదర్శి టీజీ నరసింహారావు, ఉపాధ్యక్షుడు కామేశ్‌బాబు, ప్రజానాట్యమండలి సహాయ కార్యదర్శి కళ్యాణ్ పాల్గొన్నారు.



ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి తిలకిస్తున్న ఏసీపీ రమేష్‌కుమార్, గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు తదితరులు

పూజలు



జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కట్టమైసమ్మ కల్యాణం-బోనాల వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

సన్మానం



రాంనగర్‌లో వరద నీటిలో కొట్టుకుపోతున్న కారులో ఉన్న వారిని రక్షించిన యువకులను సన్మానించిన మేయర్ విజయలక్ష్మి

నేటి నుంచి టీజీఈ సెట్ ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్

హైదరాబాద్ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): టీజీఈ సెట్ తుది దశ కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. కౌన్సెలింగ్ ప్రక్రియలో బాగంగా ధ్రువపత్రాల పరిశీలన నిమిత్తం మొదటి దశలో ఆరు హెల్ప్‌లైన్ కేంద్రాలు(హెచ్ఎల్‌సీ) ఏర్పాటు చేసిన సాంకేతిక విద్యాశాఖ అధికారులు రెండోదశ(ఫైనల్)లో హెచ్ఎల్‌సీలను సగానికి సగం తగ్గించారు. మొదటి దశ కౌన్సెలింగ్‌కు హాజరుకాని అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలన నిమిత్తం నగరంలో ఏర్పాటు చేసిన మాసబ్‌ట్యాంక్, మారేడ్‌పల్లి, రామంతాపూర్ పాలిటెక్నిక్‌లలోని హెచ్ఎల్‌సీల్లో హాజరు కావాల్సి ఉంటుంది. 18 వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవచ్చని, 21న సీట్ల కేటాయింపు ఉంటుందని సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన పేర్కొన్నారు.

'పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి'

హైదరాబాద్ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలలను ప్రభుత్వం అధీనంలోకి తీసుకొని పోలీస్‌స్టేషన్ల ద్వారా సమీక్షించాలన్నారు.

బోడుప్పల్‌లో ఓ ప్రైవేట్ అంతర్జాతీయ పాఠశాలలో డాన్స్ టీచర్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థినిపై లైంగిక దాడి జరిగిన విషయం తెలుసుకుని మంగళవారం అక్కడికి వెళ్లి పరిస్థితులను తెలుసుకున్నారు.



మహంకాళి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ మాజీ చైర్మన్‌లు, కాంగ్రెస్, బీజేపీ నాయకులు

బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

ముషీరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మహంకాళి దేవాలయంలో దేవాదాయ శాఖ కార్యనిర్వాహక అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్‌లు, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్‌లు ఎయిర్‌టెల్ రాజు, సంగిశెట్టి రాజ్‌కుమార్, రెబ్బరామారావు, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకడు జెనిగె శ్రీనివాస్ యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు నందు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డి. శివముదిరాజ్ మాట్లాడారు. ఈనెల 28, 29 తేదీల్లో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

సంగీతం సర్వరోగ నివారిణి

రవీంద్రభారతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చక్కటి స్వరాలతో తెలుగు సినీ గీతాలను ఆలపించిన గాయనీగాయకులు వీనులవిందును పంచారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో మనిష కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పాటే నా ప్రాణం శీర్షికన సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా కళాపోషకులు గోపీకృష్ణ దంపతులను ఘనంగా సత్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి మాట్లాడుతూ.. కళలు, కళాకారులను ప్రోత్సహించే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సంగీతం సర్వరోగ నివారిణి అని అన్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరి కోటి, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, కె.శ్రీనివాస్, చంద్రశేఖర్, దైవజ్ఞశర్మ తదితరులు కళాకారులను అభినందించారు. సభకు ముందు ప్రముఖ గాయకుడు మధుబాపు నేతృత్వంలోని గాయకుల బృందం పాటే నాప్రాణం పేరిట ఆలపించిన గీతాలాపన ప్రేక్షకులను అలరించింది.



గోపీకృష్ణ దంపతులను సత్కరించిన తనికెళ్లభరణి తదితరులు



మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం అందజేస్తున్న అశ్వాపురం వేణుగోపాల్ తదితరులు

అర్చకుల బదిలీ యోచనను విరమించుకోవాలి

నల్లకుంట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని దేవాలయాలలో వంశపారంపర్యంగా అర్చకత్వం చేస్తున్న వారిని బదిలీ చేయాలనే యోచనను విరమించుకోవాలని చాత్తాద శ్రీవైష్ణవ సంఘం డిమాండ్ చేసింది. చాత్తాద శ్రీవైష్ణవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుగోపాల్ నేతృత్వంలో ఓ ప్రతినిధి బృందం మంగళవారం మంత్రిని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం నల్లకుంటలో సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బదిలీ చేయడం వల్ల అర్చకులు ఇబ్బందులు పడతారన్నారు. విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం ఉపాధ్యక్షుడు తులసి సత్యనారాయణ, ప్రధానకార్యదర్శి వెంకటయోగి వెంకటేశ్వర్లు, పాలమూరు, వరంగల్, యాదగిరిగుట్ట, సిద్దిపేట అర్చకులు పాల్గొన్నారు.

స్వామి వివేకానందనగర్ వాసులకు

న్యాయం చేసేందుకు కృషి



శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

చిక్కడపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానందనగర్ వాసులకు న్యాయం చేయడానికి తనవంతు కృషి చేస్తానని రాజీవ్‌గాంధీ నగరపాలిక సంఘటన్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు, కాంగ్రెస్ నగర ఉపాధ్యక్షుడు గుర్రం శంకర్ పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి 29న స్వామివివేకానందనగర్ బస్తీలో దాదాపు 19 ఇండ్లను రెవెన్యూ, జీహెచ్ఎంసీ కూల్చివేసిన విషయం విదితమే. బాధితులు సత్యమ్మ, స్వర్ణ తదితరులు మంగళవారం శంకర్‌ను కలిసి న్యాయం చేయాలని వినతి పత్రం అందజేశారు.

28న వీరశైవలింగాయత్ వివాహ పరిచయ వేదిక

బర్కత్‌పుర, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వీరశైవలింగాయత్ జంగమ మహేశ్వర వివాహ పరిచయ వేదిక ఈ నెల 28న మలక్‌పేటలోని శుభం ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నామని మ్యారేజ్ బ్యూరో నిర్వాహకుడు వాసారం శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు వివాహ పరిచయ వేదిక కొనసాగుతుందని మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వివరాలకు 9246351842 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

వాంతులు, విరేచనాలతో

రైలులో మధ్యప్రదేశ్ వాసి మృతి

బర్కత్‌పుర, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణిస్తున్న తాపీ మేస్త్రి అనారోగ్యానికి గురై మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాజ్‌కుమార్ బెంగళూరు వెళ్లడానికి కర్ణాటక సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు గ్వాలియర్‌లో ఎక్కాడు. రైలు ఎక్కినప్పటి నుంచి అతడికి వాంతులు, విరేచనాలు అవుతుండడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చేసరికి రాజ్‌కుమార్ మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

రైలులో బంగారు నగలు చోరీ

బర్కత్‌పుర, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రైలులో బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయి. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌లో నివసిస్తున్న సంతోష్‌కుమార్(27) ఫిల్మ్ ఇండస్ట్రీలో డిజైనర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం బెంగళూరు నుంచి మైసూర్ ఎక్స్‌ప్రెస్‌లో నగరానికి వస్తున్నాడు. కాచిగూడలో రైలు దిగిన తర్వాత బ్యాగు చూసుకోగా అందులో భద్రపరిచిన రెండున్నర తులాల బంగారు నగలు కనిపించలేదు. చోరీ అయ్యాయని కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

● 12 కిలోల సరుకు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 12 కిలోల గంజాయి, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.3.45 లక్షలు ఉంటుందని తెలిపారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుదీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. కాలాపత్తర్‌కు చెందిన అబ్దుల్ ఖదీర్, ఫలక్‌నుమాకు చెందిన మహ్మద్ అర్షద్ ఆటోడ్రైవర్‌లు. డబ్బు సంపాదించడం కోసం గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. అర్ధరాత్రి గంజాయి విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న సౌత్‌వెస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని పట్టుకున్నారు. ఆసిఫ్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.